క్లుప్తంగా

దేవరపల్లిలో ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి

దేవరపల్లి: హిందూ మతోద్ధారకుడు ఆది శంకరాచార్యుల జయంతిని ఆదివారం స్థానిక శంకరాచార్య ధ్యాన మందిరంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆది శంకరాచార్య పంచలోహ ఉత్సవ విగ్రహానికి 20 రకాల ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అధిక సంఖ్యలో గ్రామస్తులు ఈ వేడుకలో పాల్గొన్నారు. గత నాలుగేళ్లుగా ధ్యాన మందిరంలో ఆదిశంకరాచార్య జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్టు మందిర కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త కోరాజు సీతారామయ్యను ఘనంగా సన్మానించారు. బుధవారం ఉదయం 11 గంటల నుంచి మందిరం వద్ద అన్నసమారాధన జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

కోటసత్తెమ్మకు రూ.1.05 లక్షల ఆదాయం

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెంలో కొలువైన కోటసత్తెమ్మ వారి ఆలయానికి ఆదివారం భారీగా భక్తులు తరలి వచ్చి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు అప్పారావు శర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రానికి తిమ్మరాజుపాలెంకు చెందిన బండి సూర్యచంద్రప్రకాష్ 150 లీటర్ల పెరుగు అందజేశారు. అమ్మవారి దర్శనాలు, ప్రసాదం , పూజా టిక్కెట్లు, ఫొటోల అమ్మకం ద్వారా రూ.1,04,787 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు.

స్వామివారికి లక్షపత్రి పూజ


గోలింగేశ్వర స్వామి

నిడదవోలు: పట్టణంలోని రాజరాజేశ్వరీ సమేత శ్రీగోలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం వైభవంగా లక్షపత్రి పూజ నిర్వహించారు.అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ ఈవో నామా సూర్య ప్రకాశరావు, అర్చకులు శ్రీకాకుళపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లతో మహిళ అరెస్టు

నిడదవోలు రూరల్: మండలంలోని సింగవరం గ్రామంలో అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్న పద్మ అనే మహిళను అరెస్ట్ చేసినట్లు ఎస్ఈబీ నిడదవోలు సీఐ కె.వీరబ్రహ్మం ఆదివారం తెలిపారు. ఆమె వద్ద 16 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ దాడుల్లో ఎస్సై ఆర్.దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు చీరల పంపిణీ

నిడదవోలు : రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ అధ్వర్యంలో ఆదివారం గొన్నాబత్తుల రామారావు ఆర్థిక సహాయంతో ఆదివారం పేద వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయలు, జి.నందకిషోర్, గుంటిపల్లి శివకుమార్, పొన్న సుబ్రహ్మణ్యశర్మ, కొత్తపల్లి నాగేశ్వరరావు, కాళ్ళ రాంబాబు, జి. భాగ్యలక్ష్మి, కె.లక్ష్మి, బలగం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఒంటరి బతుకులకు కొండంత అండ

సంక్షేమ పథకాల లబ్ధితో ఆర్థిక భరోసా


కాకరపర్తి మంగాయమ్మ
పశివేదల, కొవ్వూరు మండలం

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నవరత్నాల పేరుతో అమలు చేసిన సంక్షేమ పథకాలు ఎందరో నిరుపేదల జీవితాల్లో వెలుగు నింపాయి. ఒక్కో కుటుంబంలో మూడు నుంచి ఏడెనిమిది పథకాలు సైతం అందుకున్న కుటుంబాలు అనేకం ఉన్నాయి. దానికి ప్రత్యక్ష ఉదాహరణ తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం పశివేదల గ్రామానికి చెందిన కాకరపర్తి మంగాయమ్మ. జీవితంలో ఒంటరిగా మిగిలిపోయిన తనకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొండంత అండగా ఎలా నిలబడిందో ఆమె మాటల్లోనే..

'నాకు ఐదుగురు సంతానం. అందరికీ పెళ్లిళ్లు అయ్యాయి. ఎవరి బతుకులు వాళ్లు బతుకున్నారు. నా భర్త చనిపోయి నాలుగేళ్లయింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాల కారణంగా నా బిడ్డలపై ఆధారపడకుండా ధైర్యంగా జీవిస్తున్నాను. ప్రతి నెలా రూ.3 వేలు పింఛన్ ఇస్తున్నారు. అలా ఇప్పటివరకూ పింఛన్ రూపేణా రూ.97,750 అందించారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం నాకున్న రూ.30,144 డ్వాక్రా రుణాన్ని మాఫీ చేశారు. 45 ఏళ్ల దాటి అరవై ఏళ్ల లోపు వయసున్న మహిళలకు ఇచ్చే వైఎస్సార్ చేయూత పథకం ద్వారా రూ.56,250 సొమ్ము అందించారు. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ద్వారా మరో రూ.4,898 వచ్చింది. మొత్తం మీద వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఇప్పటివరకూ నాకు రూ.1,89,042 ఆర్థిక లబ్ధి చేకూరింది. మాలాంటి పేదలకు ఆయన ఆరాధ్యుడు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను' అని కాకరపర్తి మంగాయమ్మ సంతోషం వెలిబుచ్చింది.

పోలింగ్‌కు వేళాయె..

- నిర్వహణకు సర్వం సిద్ధం
- సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది
- గోపాలపురం సెగ్మెంట్‌లో 2,42,763 మంది ఓటర్లు
- 248 పోలింగ్ బూత్‌ల ఏర్పాటు
- నేటి ఉదయం 7 గంటల నుంచి ఓటింగ్

మండలాల వారీగా ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
గోపాలపురం	25089	26054	1	51174
దేవరపల్లి	31662	33154	1	64817
నల్లజర్ల	33610	15159	1	68800
ద్వారకాతిరుమల	28604	29366	2	57962
మొత్తం	1,18,965	1,23,793	5	2,42,763


గోపాలపురం వెలుగు పాఠశాలలోని పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లేందుకు సిద్ధమవుతున్న సిబ్బంది


పోలింగ్ నిర్వహణకు సిద్ధం చేసిన ఈవీఎంలు


ఈవీఎంలతో పోలింగ్ బూత్‌లకు వెళుతున్న సిబ్బంది

దేవరపల్లి: ఎప్పుడెప్పుడా అని ఉత్కంఠగా ఎదురు చూస్తున్న పోలింగ్ సమయం రానే వచ్చింది. ఎన్నికల ప్రచార ఘట్టం ముగియడంతో పోలింగ్ నిర్వహణకు అధికారులు, సిబ్బంది సిద్ధమవుతున్నారు. సోమవారం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. ఇందుకు అవసరమైన సిబ్బందిని, ఈవీఎంలను అధికారులు సిద్ధం చేశారు. పోలింగ్ సామగ్రిని, ఈవీఎంలను గోపాలపురం అసెంబ్లీ సెగ్మెంట్ రిటర్నింగ్‌అధికారి కేఎల్ శివజ్యోతి ఆదివారం గోపాలపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో సిబ్బందికి అందజేశారు. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,42,763 మంది ఉండగా, వారిలో పురుషులు 1,18,965 మంది. స్త్రీలు 1,23,793 మంది, ఇతరులు ఐదుగురు ఉన్నారు. పురుషుల కంటే స్త్రీలు 4848 మంది అధికంగా ఉన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 248 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. మండలాల వారీగా గోపాలపురంలో 51, దేవరపల్లిలో 67, నల్లజర్లలో 66, ద్వారకాతిరుమలలో 64 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఈ అసెంబ్లీ సెగ్మెంట్‌లో 248 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఈవీఎంలు 20 శాతం అదనంగా కలిపి 297 బ్యాలెట్ యూనిట్లు, 297 కంట్రోల్ యూనిట్లు, 30 శాతం అదనంగా కలిపి 322 వీవీ ప్యాట్‌లు కేటాయించినట్టు ఆర్‌ఓ శివజ్యోతి వివరించారు. పోలింగ్ సామగ్రి పంపిణీకి పంచాయతీ, రెవెన్యూ శాఖల నుంచి 300 మంది సిబ్బందిని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 278 మంది పీఓలు, 275 మంది ఏపీఓలు, 1100 మంది ఓపీఓలు, ఎస్ఎఫ్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ 140 మంది రూట్ అధికారులను ఏర్పాటు చేసినట్టు వివరించారు. పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది తరలింపు కోసం 75 బస్సులను ఏర్పాటు చేశారు. బందోబస్తు విధులకు 600 మంది పోలీసు సిబ్బందిని నియమించారు. ఓటు హక్కు కలిగి, పోలింగ్ కేంద్రానికి వచ్చే వారందరికీ ఓటు హక్కు కల్పిస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్టు ఆమె తెలిపారు.

సమస్యాత్మక గ్రామాలు

గోపాలపురం నియోజకవర్గంలో 139 సమస్యాత్మక పోలింగ్ బూత్‌లు, 50 అత్యంత సమస్యాత్మక పోలింగ్ బూత్‌లను గుర్తించినట్టు కొవ్వూరు డీఎస్పీ కేసీహెచ్ రామారావు తెలిపారు. మండలాలవారీగా నల్లజర్లలో 22 సమస్యాత్మక, ఐదు అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, గోపాలపురంలో 12 సమస్యాత్మక, 7 అత్యంత సమస్యాత్మక, దేవరపల్లిలో 16 సమస్యాత్మక, 6 అత్యంత సమస్యాత్మక, ద్వారకాతిరుమలలో 19 సమస్యాత్మక, 9 అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని వివరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 25 రూట్లలో 278 మంది పోలీసులను నియమించినట్టు ఆయన తెలిపారు.

సార్వత్రిక సమరానికి సై

- నేటి పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- కొవ్వూరు సెగ్మెంట్ బరిలో 11 మంది పోటీ
- 176 పోలింగ్ కేంద్రాలకు 1,408 సిబ్బంది నియామకం
- 51 బస్సుల్లో సామగ్రి, సిబ్బంది తరలింపు
- నియోజకవర్గంలో 1,84,136 మంది ఓటర్లు


కొవ్వూరు నుంచి పోలింగ్ సామగ్రిని తీసుకెళుతున్న ఎన్నికల సిబ్బంది


తాళ్లపూడిలోని ఓ కేంద్రం వద్ద పోలింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

కొవ్వూరు: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. కొవ్వూరు నియోజకవర్గంలోని 176 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 1,84,136 మంది ఓటర్లు ఉన్నారు. ఈ అసెంబ్లీ స్థానంలో 11 మంది అభ్యర్థులు బరిలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. శనివారం సాయంత్రంతో ప్రచార పర్వం ముగియడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు, వారి మద్దతుదారులు పోలింగ్‌కు సిద్ధమవుతున్నారు. ఏజెంట్ల ఏర్పాటు, ఓటరు జాబితాలను సిద్ధం చేసుకునే పనుల్లో వారంతా నిమగ్నం అయ్యారు. కొవ్వూరు పట్టణంలోని సంస్కృత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం పోలింగ్ సామగ్రి పంపిణీ చేశారు. రిటర్నింగ్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ పోలింగ్ సిబ్బందికి విధుల కేటాయించారు. ప్రతి ఓటరూ ఓటు హక్కు వినియోగించుకోవడం తమ బాధ్యతగా తీసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. పోలింగ్ సామగ్రిని చెక్ లిస్టు ప్రకారంలో అందించామని చెప్పారు. పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో సోమవారం ఉదయం 5.30 గంటలకు మాక్ పోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. తర్వాత ఉదయం ఏడు గంటల నుంచి సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌ను ప్రారంభించాలన్నారు.

ఆరు మోడల్ పోలింగ్ కేంద్రాలు

కొవ్వూరు నియోజకవర్గంలో ఆరింటిని మోడల్ పోలింగ్ కేంద్రాలుగా జిల్లా కలెక్టర్ మాధవీలత ప్రకటించారు. వాటిలో చాగల్లు ఎస్సీ ఏరియాలోని 115, తాళ్లపూడిలోని 22, కొవ్వూరు పీఎంఎం హైస్కూల్లోని 74 నంబర్ కేంద్రాలు మోడల్ పోలింగ్ స్టేషన్లు. అలాగే చాగల్లు మండలం, కలవలపల్లిలోని 149 మహిళా మోడల్ పీఎస్‌గాను, కొవ్వూరు శ్రీరామ కాలనీలోని 73వ పోలింగ్ కేంద్రాన్ని యంగ్ ఓటర్స్ బూత్ గాను, మల్లవరంలోని 138 బూత్‌ను దివ్యాంగుల బూత్‌గాను ప్రకటించారు.

పోలింగ్ విధుల్లో 1408 మంది..

నియోజకవర్గంలో 101 ప్రదేశాల్లో 176 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు రిటర్నింగ్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. పోలింగ్ నిర్వహణకు 1,408 మంది సిబ్బందిని నియమించారు. పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది, సామగ్రి తరలింపునకు ఒక్కో రూటుకు మూడు చొప్పున 51 బస్సులను ఏర్పాటు చేశారు. 203 మంది పోలింగ్ అధికారులు, 198 మంది సహాయ పోలింగ్ అధికారులు, 759 మంది ఇతర సిబ్బంది విధులు నిర్వహిస్తారు. వారికి అదనంగా 119 మంది సిబ్బందిని రిజర్వులో సిద్ధంగా ఉంచినట్టు రిటర్నింగ్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. అలాగే 17 మంది సెక్టారు అధికారులు, 39 మంది మైక్రో అబ్జర్వర్‌లను నియమించినట్టు చెప్పారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లోను వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ రోజు ఏవిధమైన సమస్యలు ఉత్పన్న కాకుండా మైక్రో అబ్జర్వర్‌లు, పోలీసు భద్రతా సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సాధరణ ఎన్నికల పరిశీలకుడు కమల్‌కాంత్ సరోచ్ ఆధ్వర్యంలో పోలింగ్ సామగ్రిని పంపిణీ చేశారు.

బందోబస్తు విధుల్లో 432 మంది

పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు నియోజవర్గ వ్యాప్తంగా 432 మంది భద్రతా సిబ్బందిని నియమించినట్టు స్థానిక డీఎస్పీ కేసీహెచ్ రామారావు తెలిపారు. తనతో పాటు మరో డీఎస్పీ, కొవ్వూరు పట్టణ, రూరల్ సీఐలతో పాటు మరో ఇద్దరు సీఐలు, ప్రస్తుతం నియోజకవర్గంలో ఉన్న ఐదుగురు ఎస్సైలతో పాటు మరో ముగ్గురు ఎస్సైలు, రాజస్థాన్ ఆర్మ్‌డ్ ఫోర్సు సిబ్బంది 64 మంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు 176 మంది సేవలు అందిస్తారన్నారు. వారితో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు కుడా తమ వంతు సేవలందిస్తారన్నారు. అలాగే స్ట్రైకింగ్ ఫోర్సు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్సులు అందుబాబులో ఉంచామని చెప్పారు.

ఓటింగ్‌కు సర్వం సిద్ధం

- నియోజకవర్గంలో 205 పోలింగ్ కేంద్రాలు
- సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లిన సిబ్బంది
- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెటీరియల్ పంపిణీ
- విస్తృతంగా భద్రతా ఏర్పాట్లు


నిడదవోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలింగ్ మెటీరియల్‌ను సరి చూసుకుంటున్న అధికారులు, సిబ్బంది

నిడదవోలు: నియోజకవర్గంలో పోలింగ్ నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. నిడదవోలు పట్టణం, నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లో 205 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నిడదవోలులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలింగ్ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈవీఎంలు, ఇతర పోలింగ్ సామగ్రి, పోలింగ్ అధికారులు, సిబ్బందిని ఆయా పోలింగ్ కేంద్రాలకు 21 రూట్‌ల ద్వారా తరలించేందుకు 60 బస్సులను ఏర్పాటు చేశారు. పోలింగ్ అధికారులు 223 మందిని, సహాయ పోలింగ్ అధికారులు 228 మందిని, మైక్రో అబ్జర్వర్లు 46 మందిని, ఓపీవోలు 874 మందిని, వెబ్ కాస్టింగ్ సిబ్బంది 205 మందిని నియమించారు. అదనంగా అకౌంటింగ్ బృందాలు రెండు, ఎస్ఎస్‌టీ బృందాలు 9, ఎఫ్ఎస్టీ బృందాలు 9, ఎంసీసీ టీమ్‌లు 3, సెక్టార్ అధికారులుగా 21 మందిని నియమించారు. నియోజకవర్గంలో గుర్తించిన 41 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. అలాగే 102 పోలింగ్ స్టేషన్ల లొకేషన్లను గుర్తించి బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్తు, మరుగుదొడ్లతో పాటు దివ్యాంగులకు అవసరమైన వీల్ చైర్‌లను కూడా ఏర్పాటు చేశారు. అంధులు ఓటు వేసేందుకు వీలుగా బ్రెయిలీ లిపీతో ఉన్న ప్రత్యేక బ్యాలెట్ నమూనాలను పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కెమెరాలతో పాటు ఒక వీడియోగ్రాఫర్‌ను నియమించారు. సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

నియోజకవర్గ ఓటర్లు	2,13,396
మహిళలు	1,09,157
పురుషులు	1,04,235
ఇతరులు	04
పోలింగ్ కేంద్రాల సంఖ్య	205

పటిష్ట పోలీసు బందోబస్తు

నియోజకవర్గంలో సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో భద్రతా విధులు నిర్వహించేందుకు 490 మందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్టు రాజమహేందంరవరం దిశ డీఎస్పీ బి.ఆదినారాయణ చెప్పారు. నియోజకవర్గంలో గుర్తించిన 41 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద సాయుధ బలగాలు, సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ పక్రియకు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సమస్యాత్మక గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సాయుధ బలగాలు, పోలీసుల నిఘా ఏర్పాటు చేశారు. అసాంఘిక శక్తులు, అల్లరి మూకలపై గట్టి నిఘా పెట్టడమే గాకుండా షాడో పార్టీలతో పర్యవేక్షణ ఏర్పాటు చేశారు. పోలింగ్ బూత్ పరిసరాల్లో 30 పోలీసు యాక్ట్, సెక్షన్ 144 సీఆర్‌పీసీ అమలులో ఉంటుందని డీఎస్పీ తెలిపారు. నియోజకవర్గంలో ఎన్నికల భద్రతా విధులను ఇన్‌చార్జి సీఐ వి. జానకీరామయ్య, నలుగురు ఎస్సైలు, 18 మంది ఏఎస్సైలు, 101 మంది పీసీలు, 18 మంది హోమ్‌గార్డులు, 160 మంది ఎన్‌సీసీ, 10 టీమ్‌ల సీఆర్‌పీ, 21 మందితో కూడిన మెబైల్ పార్టీ నిర్వహించనున్నారు.


ఈవీఎంలు, పోలింగ్ సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న అధికారులు, సిబ్బంది


నిడదవోలు చర్చిపేటలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో సిద్ధమైన పోలింగ్ కేంద్రం

అప్పటి వరకూ ఈవీఎంలు తెరవొద్దు

దేవరపల్లి: సోమవారం ఉదయం 5.30 గంటల వరకూ మాక్ పోలింగ్ నిర్వహించే వరకూ ఈవీఎంలను తెరవొద్దని గోపాలపురం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కేఎల్ శివజ్యోతి పీఓలు, ఏపీఓలకు సూచించారు. పోలింగ్ విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి ఆదివారం ఆమె గోపాలపురంలో మాట్లాడారు. మాక్ పోలింగ్ నిర్వహణకు పోలింగ్ ఏజెంట్లు విధిగా హాజరు కావాలన్నారు. ఈవీఎంలకు ఎక్కువ వెలుతురు తగలకుండా కిటికీలు మూసి వేయాలని, ట్యూబ్‌లైట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈవీఎంలలో ఎలాంటి ఇబ్బందులు వచ్చినా వెంటనే సెక్టోరియల్ అధికారికి తెలియజేయాలన్నారు. పోలింగ్ సిబ్బందికి అన్ని ఏర్పాట్లు చేసినందున ఎవరూ పోలింగ్ కేంద్రాల నుంచి బయటకు వెళ్ల వద్దని ఆదేశించారు. పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా వెబ్ కాస్టింగ్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.


ఈవీఎం, పోలింగ్ సామగ్రితో గోపాలపురం నుంచి పోలింగ్ కేంద్రాలకు వెళుతున్న సిబ్బంది

పేదల బతుకుల్లో వెలుగులు

- తల్లీకూతుళ్లకు అందుతున్న పింఛను
- రుణ మాఫీ, సున్నా వడ్డీతో లబ్ధి
- జగనన్న కాలనీలో సమకూరిన సొంత ఇల్లు
- ఆదుకున్న సంక్షేమ పథకాలు

పథకం పేరు	చేకూరిన లబ్ధి (రూ.ల్లో)
వైఎస్సార్ పింఛను కానుక	1,40,750
వైఎస్సార్ సున్నా వడ్డీ(డ్వాక్రా)	9,700
వైఎస్సార్ ఆసరా (డ్వాక్రా రుణమాఫీ)	12,201
ఇంటి స్థలం విలువ	2,00,000
(ప్రభుత్వ లెక్కల ప్రకారం) ఇంటి నిర్మాణానికి అందించిన సాయం	1,80,000
మొత్తం చేకూరిన లబ్ధి	5,42,651

(ఇంటి స్థలం విలువ ఆ ప్రాంతంలో బహిరంగ మార్కెట్ విలువ రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలు ఉంటుంది.)


కొవ్వూరు మండలం వేములూరులో జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించిన ఇంటి వద్ద పిన్నింటి రామలక్ష్మి, ఆమె తల్లి గవర రాములమ్మ

కొవ్వూరు: నా చిన్నతనంలోనే తండ్రి చనిపోయారు. 22 ఏళ్ల క్రితం నా భర్త చనిపోయాడు. కూలి పనులు చేసుకుంటూ బతుకుతున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు మా బతుకుల్లో వెలుగులు నింపాయంటోంది కొవ్వూరు మండలం వేములూరుకు చెందిన పిన్నింటి రామలక్ష్మి. ఆమె మాటల్లోనే.. 30 ఏళ్లుగా అద్దె ఇళ్లల్లో ఉండేవాళ్లం. మాకంటూ సొంత గూడు లేదని మదన పడేవాళ్లం. జగనన్న దయ వల్ల ఇంటి స్థలం, ఇల్లు మంజూరయ్యాయి. సొంత ఇంటిని నిర్మించుకున్నాం. మా అమ్మ గవర రాములమ్మకు నాకు వితంతు పింఛను రూ.3 వేల చొప్పున అందుతోంది. ఇద్దరికీ ఇప్పటివరకూ రూ.1,40,750 పింఛను సొమ్ము అందుకున్నాం. నెలవారీ ఖర్చులకు ఇవి అక్కరకొస్తున్నాయి. నా కుమార్తెకు పెళ్లి చేశాను. నా బాధ్యత తీరింది. ప్రస్తుతం మా అమ్మ, నేను కలిసి జగనన్న ఇచ్చిన కొత్త ఇంట్లోనే జీవిస్తున్నాం. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ఇప్పటి వరకూ నాలుగు విడతల్లో రూ.12,201 డ్వాక్రా రుణం మాఫీ అయ్యింది. సున్నా వడ్డీ పథకం ద్వారా రూ.9,700 అందాయి. ప్రస్తుతం మాకు స్థలాలు ఇచ్చిన పక్కనే రియల్ ఎస్టేట్ వ్యాపారులు లే అవుట్ వేసి, సెంటు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ అమ్ముతున్నారు. సమీపంలోనే రైల్వే స్టేషన్ ఉంది. కొవ్వూరు పట్టణానికి మా కాలనీ మధ్య కేవలం రైల్వే స్టేషన్ మాత్రమే అడ్డు. ఇంత విలువైన ప్రదేశంలో పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడం నిజంగా చాలా సంతోషదాయకం. ప్రభుత్వ లెక్కల ప్రకారం చూసినా వైఎస్సార్ సీపీ పాలనలో అన్ని పథకాలకు, ఇళ్లు, ఇంటి స్థలం అన్నీ లెక్కిస్తే రూ.5.50 లక్షల మేరకు లబ్ధి చేకూరింది.

పింఛను సొమ్ముతో బతుకున్నాం



మా అమ్మకి, నాకు ప్రతి నెలా అందిస్తున్న వితంతు, వృద్ధాప్య పింఛన్లు నెలవారీ ఖర్చులకు సరిపోతున్నాయి. సొంత గూడు సమకూరడం మూలంగా అద్దె భారం తగ్గింది. కుటుంబ యాజమానిని కోల్పోయి మోడువారిన మాలాంటి వాళ్లకు జగనన్న కొండంత అండగా నిలిచారు. ఇచ్చిన మాట ప్రకారం ఏటా పింఛను సొమ్ము రూ.250 చొప్పున పెంచారు. ఇద్దరికీ నెలకు రూ.6 వేల పింఛను అందుతోంది. నేను కూలీ పనులకు వెళుతున్నా. మా అమ్మ వృద్ధాప్యం కారణంగా కూలీకి వెళ్లలేని పరిస్థితి ఉంది. పింఛన్ల సొమ్ముతో ఇబ్బందిలేకుండా బతుకుతున్నాం. డ్వాక్రా సంఘంలో ఉండడం వల్ల ఆసరా, సున్నా వడ్డీ వంటి పథకాల ద్వారా లబ్ధి చేకూరింది.

–పిన్నింటి రామలక్ష్మి, వేములూరు, కొవ్వూరు మండలం

వృద్ధాప్యంలో బెంగలేదు



ఎంతోమంది వృద్ధాప్యం మీద పడి నిరాదరణలో ఉన్నారు. పింఛను రూ.3 వేలు అందడం మూలంగా నెలవారీగా ఖర్చులకు ఢోకా లేదు. వైద్య సేవలు గ్రామంలో స్థానికంగా అందుబాటులో ఉన్నాయి. ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో అన్ని రకాల పరీక్షలు చేసి, మందులు ఇస్తున్నారు. చేరువలో ఉన్న కొవ్వూరు ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందుతున్నాయి. ఇటీవల మరో రెండు పట్టణ ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించారు. వైద్యులు ఇంటింటికీ వచ్చి (ఫ్యామిలీ డాక్టర్) ఆరోగ్య సమస్యలు తెలుసుకుని, సేవలందించడం గతంలో ఎన్నడూ లేదు.

–గవర రాములమ్మ, వేములూరు, కొవ్వూరు మండలం

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

నల్లజర్ల: స్థానిక ప్రియాంక కన్వెన్షన్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుణ్ణంపల్లి సిద్దూ అనే మూడేళ్ల బాలుడు అక్కడికక్కడే మృతి చెందగా, అతడి పిన తండ్రి గాయపడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం ద్వారకాతిరుమల మండలం గుణ్ణంపల్లికి చెందిన గొన్నూరి రాజు, మరియమ్మల కుమారుడైన సిద్దూ ఆదివారం దూబచర్లలో బంధువుల ఇంట జరిగిన శుభ కార్యానికి కుటుంబ సభ్యులతో కలసి వచ్చాడు.. సిద్దూ పినతండ్రి సూర్యచంద్రరావు బైక్‌పై సిద్దూను ఎక్కించుకొని నల్లజర్ల బస్టాండ్‌లో ఉన్న తమ బంధువులను కలుసుకునేందుకు బయలుదేరాడు. ప్రియాంక కన్వెన్షన్ సమీపంలో ఏలూరు నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వారి బైక్‌ను వెనుక నుంచి ఢీ కొట్టింది. కిందపడిన సిద్దూపై నుంచి బస్సు వెళ్లడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు.గాయపడిన సూర్యచంద్రరావును తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నల్లజర్ల ఎస్ఐ సురేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిడదవోలు డివిజన్
90102 34548 (కొవ్వూరు)
90100 51493 (నిడదవోలు)
90100 68395 (గోపాలపురం)
Office mail : tpgadvt@gmail.com